## క్లుప్తంగా

### వైఎస్సార్ సీపీ కార్యకర్త ఇంటిపై రాళ్ల దాడి

మద్దిపాడు: మండలంలోని లింగంగుంట గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త కే సురేష్ ఇంటిపై టీడీపీకి చెందిన కొంతమంది బుధవారం రాత్రి రాళ్లతో దాడి చేశారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మళ్లీ దాడి చేసి ఇంట్లో వస్తువులను ధ్వంసం చేసినట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మండవ అప్పారావు తెలిపారు.

### సొసైటీ అధ్యక్ష పదవికి రాజీనామా


పూనాటి అప్పారావు

మద్దిపాడు: మండలంలోని నందిపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్ష పదవికి పూనాటి అప్పారావు బుధవారం రాజీనామా చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడిన క్రమంలో తాను రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించి తన రాజీనామా పత్రాన్ని సొసైటీ కార్యనిర్వహణాధికారికి, జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ అధికారులకు అందించారు. ఆయనతో పాటు డైరెక్టర్లు జవ్వాజి లక్ష్మీ నారాయణరెడ్డి, మండవ బాలచంద్రమౌళి కూడా రాజీనామా చేశారు.

### కేంద్ర సహాయ మంత్రిని కలిసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు


శ్రీనివాసవర్మను సన్మానిస్తున్న శివారెడ్డి

ఒంగోలు సెంట్రల్: కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మను బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి బుధవారం విజయవాడలో కలిసి సన్మానించారు. జిల్లా స్థితిగతుల గురించి వివరించారు. జిల్లా పర్యటన చేసి అభివృద్ధికి తగిన చేయూతనివ్వాలని కోరారు. జిల్లాపై సమగ్ర అధ్యయనం చేసి త్వరలో జిల్లాకు పరిశ్రమలు వచ్చే విధంగా కృషి చేస్తానని వర్మ చెప్పినట్లు శివారెడ్డి తెలిపారు. బీజేపీ జిల్లా ఇన్‌చార్జి రవిశంకర్, ప్రధాన కార్యదర్శి శివాజీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### సమయపాలన పాటించకుంటే చర్యలు

హనుమంతునిపాడు: సమయపాలన పాటించకుండా విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సచివాలయ సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తప్పవని ఎంపీడీఓ కె.లలిత హెచ్చరించారు. సచివాలయ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ ఇంజినీర్ అసిస్టెంట్లతో బుధవారం సాయంత్రం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజర్ తప్పనిసరిగా వేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల నిర్వహణ రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలన్నారు. విధి నిర్వహణ రికార్డులు, సంక్షేమ పథకాలు రికార్డుల సిద్ధం చేసి జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. నూతన ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఏఓ కేవీ క్రిష్టారావు, సీనియర్ అసిస్టెంట్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

### నేడు సమస్యల పరిష్కార వేదిక

ఉలవపాడు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం ఉదయం సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు తహసీల్దార్ చంద్రారెడ్డి తెలిపారు. ఉదయం 9:30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. సబ్ కలెక్టర్ విద్యాధరి కార్యక్రమంలో పాల్గొని అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు హాజరవుతారన్నారు. ప్రజలు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### గుర్తింపు పొందిన పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించండి

యర్రగొండపాలెం: గుర్తింపు పొందిన పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని ఎంఈవోలు ఆంజనేయులు, మల్లు నాయక్ బుధవారం కోరారు. ప్రైవేటు పాఠశాలల నిర్వహణకు ప్రభుత్వ గుర్తింపు తప్పనిసరిగా ఉండాలన్నారు. గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలలు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని వారు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పాఠశాలలు నిర్వహిస్తే శాఖాపరమైన చర్యలు ఉంటాయని వారు హెచ్చరించారు. ప్రైవేటు పాఠశాలల్లో సైతం ప్రభుత్వం నిర్దేశించిన సిలబస్ బోధించాలని, సంబంధిత పాఠ్య పుస్తకాలు ఉపయోగించుకోవాల్సి ఉంటుందని, ఫీజు వివరాలు డిస్‌ప్లే బోర్డులో ప్రదర్శించాలని వారు వివరించారు. ప్రతి పాఠశాలలో సౌకర్యవంతంతో పాటు పరిశుభ్రమైన మరుగుదొడ్లు విద్యార్థులకు అనుగుణంగా ఉండాలన్నారు.

### ఉపాధి హామీ పనులపై సమీక్ష

గుడ్లూరు: ఉపాధి హామీ పనులపై స్థానిక ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఏపీఓ అబ్దుల్లా బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు కూలీలు ఉదయం 6 గంటలకే పని ప్రదేశాలకు చేరుకొని 10 గంటలు వరకు పనులు చేయించాలని ఫీల్డు అసిస్టెంట్లకు సూచించారు.


ఆఫీసు రూమ్


జూనియర్ కాలేజీ భవనం


వంట గది

# కరవది హైస్కూల్‌కు మహర్దశ

- బాలికల జూనియర్ కాలేజీగా అప్‌గ్రేడ్
- ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో అడ్మిషన్లు
- కార్పొరేట్‌కు దీటుగా వసతులు
- వేరువేరుగా హైస్కూల్, జూనియర్ కాలేజీ భవనాలు
- సబ్జెక్టు బోధనకు ఉపాధ్యాయులు
- విశాలమైన స్టడీ అవర్స్‌కు ప్లేస్
- 10 ఎకరాల ఆట స్థలం
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాడు-నేడు కార్యక్రమం ద్వారా కార్పొరేట్ సౌకర్యాలు


కరవది హైస్కూల్

ఒంగోలు రూరల్: మండలంలోని కరవది జిల్లా పరిషత్ హైస్కూల్‌కు మహర్దశ పట్టింది. రోజురోజుకూ హైస్కూల్ అభివృద్ధి చెందుతోంది. ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీగా హైస్కూల్ అప్‌గ్రేడ్ అయింది. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయి. కార్పొరేట్‌కు దీటుగా వసతులు కల్పించారు. వేరువేరుగా హైస్కూల్, జూనియర్ కాలేజీలకు భవనాలు కేటాయించి సబ్జెక్టుల బోధనకు ఉపాధ్యాయులను సిద్ధం చేశారు. విశాలమైన స్టడీ అవర్స్‌కు స్థలం అందుబాటులో ఉండటంతో పాటు 10 ఎకరాల ఆట స్థలం కూడా ఉంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన నాడు – నేడు కార్యక్రమంలో భాగంగా హైస్కూల్లో మౌలిక సదుపాయాలు కల్పించారు. భవనాలను రీమోడలింగ్ చేశారు. తరగతి గదుల నిర్మాణం, ఫ్లోరింగ్ నిర్మాణం, విద్యుత్ సౌకర్యం, కంప్యూటర్ల ఏర్పాటు, ఆధునిక బెంచీలు, ఫ్యాన్లు, లైటింగ్ సిస్టం వంటివి ఏర్పాటు చేశారు. అదే సమయంలో హెచ్‌ఎం రూమ్, కిచెన్ రూమ్ నిర్మించారు. అప్పటికే ఉన్న రేకులు షెడ్‌లో మార్పులు చేసి డైనింగ్ హాల్‌గా మార్చారు. నూతనంగా స్త్రీ, పురుషులకు మరుగుదొడ్లు నిర్మించారు. బాలబాలికలకు మరుగుదొడ్ల నిర్మాణంతో పాటు స్టేజీ ఎత్తు పెంచి దాతల పైకప్పు నిర్మాణం పూర్తిచేశారు. స్కూల్ వెనుక భాగంలో నిర్మించిన రెండు అంతస్తుల భవనంలో గత రెండేళ్లుగా బాలికలకు జూనియర్ కాలేజీ తరగతులు నిర్వహిస్తున్నారు. ఆట స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించారు. సైకిల్ స్టాండ్ ఏర్పాటు చేశారు. అందమైన పూలు, క్రోటన్స్ తోటలు పెంచుతున్నారు. గత పదేళ్లుగా పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన చరిత్ర కరవది హైస్కూల్‌కు ఉంది. ప్రజాప్రతినిధుల సహాయ సహకారాల వలన జిల్లాలోనే కరవది హైస్కూల్ మంచి స్థానం దక్కించుకుంది. కార్పొరేట్ విద్యాలయాల కంటే ప్రభుత్వ స్కూళ్లు అన్నిరకాలుగా ముందంజలో ఉన్నాయని హెచ్‌ఎం రవికుమార్ సాక్షికి తెలిపారు.


విశాలమైన ఆట స్థలం


హ్యాండ్ వాష్‌కు కుళాయిలు


డైనింగ్ హాల్


తరగతి గదులు


బుధవారం కాలేజీ ప్రారంభమవడంతో జూనియర్ కాలేజీకి హాజరైన విద్యార్థినులు


హైస్కూల్, జూనియర్ కాలేజీ ముఖద్వారం


పైకప్పుతో స్టేజీ నిర్మాణం


పాఠశాల ఆవరణలోని ఫలవృక్షం

## గణనాథునికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో కార్యసిద్ధి గణపతి


గణపతి పూజలో పాల్గొన్న భక్తులు


లక్ష్మీగణపతి హోమంలో అర్చకులు

ఒంగోలు మెట్రో: క్రోధి నామ సంవత్సరం జేష్ట మాసం బుధవారం నగరంలోని గణపతి ఆలయాల్లో అభిషేకాలు, అర్చనలను వైభవంగా నిర్వహించారు. స్థానిక పేర్నమిట్ట సిద్ధిబుద్ధి దేవస్థానంలో, కర్నూలు రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఉన్న గణపతి ఆలయంలో, అద్దంకి బస్టాండ్ దగ్గర ఉన్న విజయ గణపతి దేవాలయంలో, బాబూజీ కాంప్లెక్స్ ఆవరణలో కొలువై ఉన్న వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో, నెల్లూరు బస్టాండ్ దగ్గర సిద్ధి గణపతి దేవాలయంలో, రాజాపానగల్ రోడ్డులోని లక్ష్మీగణపతి దేవస్థానంలో, శ్రీనగర్ కాలనీలోని సిద్ధిబుద్ధి సమేత గణపతి దేవాలయంలో, సమతానగర్లోని మణికంఠ నగర్లోగల కార్యసిద్ధి గణపతి దేవాలయంలో అర్చక స్వాములు ఉదయం ఏడు గంటలకు గణపతి మూలవిరాట్లకు సుగంధ పరిమళ ద్రవ్యాలు, పసుపు, కుంకుమ, గంధం, విభూది, చందనం, పన్నీరు, కొబ్బరినీళ్లు, పాలు, పెరుగు, తేనె, చక్కెర, వివిధ రకాల పండ్ల రసాలతో పంచామృత అభిషేకం నిర్వహించారు. గణనాథునికి పంచ హారతులిచ్చి భక్తులకు దివ్యదర్శన భాగ్యం కల్పించారు. కార్యసిద్ధి గణపతి దేవస్థానంలో భక్తిశ్రద్ధలతో లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. అనంతరం మంత్రపుష్పం ఆశీర్వచనం, తీర్థ ప్రసాద వినియోగం జరిగింది. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు.

## ఘనంగా పోలేరమ్మ తిరునాళ్ల


విద్యుత్ కాంతులతో పొట్టేళ్ల ప్రభలు


ఎడ్ల ప్రభలు

నాగులుప్పలపాడు: మండలంలోని ఉప్పుగుండూరులో యాదవ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి కొండపాటూరి పోలేరమ్మ తల్లి తిరునాళ్లను ఘనంగా నిర్వహించారు. వాస్తవానికి ఈ తిరునాళ్ల ప్రతి ఏడాది మే నెలలో నిర్వహిస్తున్నప్పటికీ ఈ ఏడాది ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆలస్యమయ్యాయి. మంగళవారం రాత్రి గ్రామంలో జరిగిన తిరునాళ్లలో అమ్మవారికి 5 ఎడ్ల ప్రభలు, 5 పొట్టేళ్ల ప్రభలతో పాటు మొత్తం 12 ప్రభలను ఏర్పాటు చేశారు.

మంగళవారం రాత్రి నుంచి ప్రారంభమైన ఈ తిరునాళ్లలో వీరతాళ్ల మోతలు, బొల్లావుల సాంస్కృతిక కార్యక్రమాలు, విచిత్ర వేషధారణలతో అత్యంత వైభవంగా గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ జాతరలో యువత వీరతాళ్లతో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం భక్తులు పెద్ద ఎత్తున బుధవారం అమ్మవారికి పొంగళ్లు సమర్పించారు.

## తాత్కాలికంగానైనా బాగు చేయండి సార్..




గనివానిపాడు, వాగుమడుగు మార్గంలో కోతకు గురైన చప్టాలు

కొనకనమిట్ల: ఉపరితల ద్రోణి, నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలకు కొనకనమిట్ల మండలంలోని పలు రహదారులు కోతకు గురై నడవడానికి కూడా ఇబ్బందికరంగా మారాయి. ముఖ్యంగా వాగుమడుగు నుంచి గనివానిపాడు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. చప్టాల వద్ద భారీగా రోడ్డు కోతకు గురైంది. అలాగే గనివానిపాడు నుంచి కలవలపల్లి వెళ్లే మట్టి రోడ్డు కోతకు గురైంది. అధికారులు స్పందించి రహదారులకు తాత్కాలికంగానైనా మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. రోడ్లు దెబ్బతిన్న విషయం అధికారులకు ఇప్పటికే తెలియజేసినట్లు గనివానిపాడు సర్పంచ్ పాలూరి లక్ష్మీసాంబ వెంకటేశ్వర్లు తెలిపారు.

## కరవది పీహెచ్‌సీకి షుగర్ టెస్టింగ్ మిషన్ బహూకరణ


మిషన్ అందజేస్తున్న శిరిగిరి కృష్ణారావు దంపతులు

ఒంగోలు రూరల్: మండలంలోని కరవది పీహెచ్‌సీలో నిత్యం అవసరమైన రూ.30 వేల విలువ చేసే షుగర్ టెస్టింగ్ మిషన్‌ను శిరిగిరి కృష్ణారావు, సుబ్బారావమ్మ దంపతులు బుధవారం బహూకరించారు. పీహెచ్‌సీ లేబరేటరీలో రక్తంలోని సీరం, ప్లాస్మా టెస్టులు నిర్వహించేందుకు ఈ మిషన్‌ను మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుందర్ ప్రసాద్, హెచ్‌ఈఓ కృష్ణారెడ్డిలకు వారు అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ కరవది ఆస్పత్రిని అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత గ్రామస్తులపై ఉందన్నారు. అందులో భాగంగా తనకు తోచిన సహాయం అందజేసినట్లు తెలిపారు. అనంతరం మీటింగ్ హాలులో సమావేశం నిర్వహించి పలు సమస్యలపై మాట్లాడారు. అనంతరం వలేటివారిపాలెంలో ఏఎన్‌ఎంగా పనిచేస్తున్న భారతిని ఉత్తమ సేవలకుగానూ ఘనంగా సన్మానించారు. గ్రామస్తులు, ఫార్మా అసిస్టెంట్ శ్రీధర్, ఎల్‌టీ మహేష్, ఎస్‌ఎన్ జ్యోతి, భానుమతి, సీహెచ్‌ఓ అశోక్ పాల్గొన్నారు.

## పచ్చని హొయలు

కొనకనమిట్ల: ప్రకృతి రమణీయత మనసును ఆహ్లాదపరుస్తుంది. ఎంతో ఉత్సాహాన్నిస్తుంది. ఆ అందాలు చూపును కట్టిపడేస్తాయి. రహదారుల వెంట ఉన్న పచ్చని చెట్లు కోనసీమను తలపించేలా ఉన్నాయి. కొనకనమిట్ల మండలంలోని వెలుగొండ స్వామి టెంపుల్, చినారికట్ల జంక్షన్, వాగుమడుగు వెళ్లే రహదారులతో పాటు జిల్లాలోని ఒంగోలు-చీమకుర్తి, పొదిలి-దర్శి-కురిచేడు వెళ్లే రహదారులకు ఇరువైపులా పచ్చని, ఎర్రని పుష్పాలు తోరణాలు కట్టి అలంకరించినట్లున్నాయి. ఇటీవల మంచి వర్షాలు కురవటంతో వేప, చింత, కానుగ, తురాయి చెట్లు అందంగా కనువిందు చేస్తున్నాయి.


కంభాలపాడు, చినారికట్ల జంక్షన్ మార్గంలో పందిళ్లను తలపిస్తున్న చింతచెట్లు